# పురుషస్వభావం

భోజనంచేసి లవంగమొగ్గ నోట్లోవేసికొని మాఆవిడ అన్నంతింటూంటే సాయంగా కూర్చుని ఏవో కబుర్లు ప్రారంభించాను. కబుర్లు చెపుతూవుంటే నాకు గబుక్కున జ్ఞాపకంవచ్చి కబుర్ల ధోరణి ఆపి,

"ఒసేవ్ ఇదివిను" అని తొందరగా అన్నా.

"ఏమిటి విచిత్రం" అంది నాధర్మపత్ని.

"చూచావ్! మనయింటికి ఎదురుగుండా వున్న ఎత్తరుగుల యిల్లు! శారద! జ్ఞాపకంలేదూ." అన్నాను.

"ఊఁ అవును, శారద?"

"పాపం; ఆవిడను మొగుడు, ఎద్దును మోదినట్లు మోదుతాడట; కూచుంటేపోటు; నుంచుంటేపోటు; 'పాపం! అలా బాధపెడతాట్ట' అన్నాను.

"ఎందుకు మోదుతాడూ! ఆవిడేమి చేసిందో పాపం" అంది మాఆవిడ.

"ఆవిడపై ఏదో అనుమానంట" అన్నాను.

"ఎంత చదువు చదివినా మీమగవారి స్వభావమే అంత" అంది కొద్దిగా గట్టిగా.

"అదుగో; నువ్వెప్పుడూ అంతే; ఆవిడ మొగుడొక్కడూ అలాచేస్తే ఇంక ప్రపంచంఅంతా అంతేనా; నాకేదైనా అనుమానముంటేగా నీ మీద, నువ్వలా అనడానికి" అని అన్నాను.

"శారద మొగుడికి పుట్టినబుద్ధే మీక్కూడాపుట్టకూడదా యేమిటి?" అంది.

"నాకటువంటి బుద్ధి పుట్టదని ఢంకా బజాయించి చెప్పగలను. ఏమిటి! పిచ్చిపిచ్చి మాటలు చెపుతావు? నేనెప్పుడైనా ఏ విషయాన్నిగురించయినా అనుమానించానా! పురుషులు స్త్రీలపై అనుమాన పడకూడదని నావాదన" అన్నాను.

"చాల్లెద్దురూ" అంటూ భోజనం ముగించింది.

* * * *

నాకు వాక్కు వెయ్యడం చాలాసరదా. నాకు రోజూ అదో అలవాటు అయిపోయింది. ఆవేళ ఆదివారము. ఆఫీసుకు సెలవు. ఏమీ తోచుటలేదు. ఒంట్లో నలతగా వుంది. రోజూ రాత్రి పదిగంటలైనా ఇల్లుచేరికోని వాడిని సాయంకాలం 5½కే ఇంటికి వచ్చేశాను. మాయిల్లు లోపల గడియ వేయబడి వుంది. రెండుసార్లు తలుపు తట్టాను. మాఆవిడ వచ్చేజాడ కనబడలే! గుమ్మానికి కన్నంవుంది. దానిగుండా చూస్తూ"ఒసేవ్"అని గొంతుకు చించుకుని కేక వేశాను. ఐదు నిమిషాలు అరవగా "వస్తున్నా; వచ్చె; వచ్చె" అన్న కేకవినపడింది. కొంతసేపయిన తరువాత మాఆవిడ పడక గదిలోంచి వస్తుండడం, కదలికలేక వెలుగుతూన్న కిరసనాయిలు బుడ్డిని ఆర్పడం చూశాను. కాస్సేపయిన తరువాతవచ్చి తలుపును తెరస్తూ, "ఇంత త్వరగా వేంచేశారేం?" అంది.

"నేను త్వరగా ఇంటికి రావడం నీకిష్టంలేదేమిటి? అదేదో విశదంగాచెప్పు? పావుగంటనుండి పడిగాపులు పడి కూర్చుంటే, వస్తున్నా అని ఎంతకీతలుపు తియ్యవేం? ఇంకా దీపం వెలిగించ లేదేం?" అన్నాను. చొక్కావిప్పి వంకెన తగిలిద్దామని గదిలో ప్రవేశించేటప్పటికి "సెంటు"వాసన గుప్పుమంది.

"దీపం వెలిగించకేం; వెలిగించా; ఆరిపోతుంది" అని తిరిగి వెలిగించింది. దీపపువెల్తురులో ఆమె నలిగిన పువ్వులను, చెరిగిన పాపిడను, ముడతులుపడిన కోకను చూడకలిగాను. ఎప్పుడూ "సెంటు" వాడేదికాదు. ఈ వేళ ఎందుకు వాడిందో! మా ఆవిడ చేస్తున్న ప్రతీకృత్యం తలుపు కన్నంలోంచి చూశాను గనక సరిపోయింది; లేకపోతే ఏమయేదో! ఎన్ని అబద్ధాలాడేదో? యిటువంటి మనుష్యుల్ని నరకాలా? పాతాలా? పైగానూ ఆడవాళ్ళు పెద్ద పతివ్రతలని చెపుతుంది, అని అనుకొన్నా. అప్పుడువచ్చిన కోపం అంతవరకు నా జీవితంలో ఎప్పుడూరాలేదు. గోళ్ళు కొరుక్కొంటూ వాల్చిన మడతమంచం మీద కూలబడ్డా.

# పురుషస్వభావం

కోపంతో నాశరీరంలోని ప్రతీజీవాణువూ ఉడికినట్టయింది. ముచ్చెమటలుపోశాయి. "గదిలో తువ్వాలు ఇలా తీసుకురా" అన్నాను కోపాన్ని కొంతవరకు అణుస్తూ! "నే లేవలేనుస్మా; మీరేపోయి తెచ్చుకోండి" అందినిస్సార భావంగా. ఆ మాట నాకోపాగ్నికి ఆజ్యములా అయింది.

విధిలేక బుడ్డి తీసికొని బిరికీ దగ్గరకు వెళ్ళాను. తువ్వాలు కనిపించలేదు. ఆ తువ్వాలు పందిర మంచంమీద ఉంది. మంచంమీద ఎవరో నాదుప్పటీ కప్పుకు పడుక్కున్నారు. ఆ మంచంమీద నాలుగైదు గులాబీ రేకులు పడివున్నాయి.

"ఎవడ్రా నువ్వు! నాపందిరి పట్టిమంచం పరుపుమీద పడుకోడానికి? నీకెవ్వత్తె ఇచ్చిందిరా అధికారం?" అంటూ దుప్పటిలాగితే; ఏముంది? పక్కబట్టలు; నాచొక్కాలు!!! అచ్చంగా మనిషి పరుండినట్లే వున్నాయి. మా ఆవిడకడుపుబ్బేటట్లుగా నవ్వుతోంది.

ఆ పరిస్థితిలో మా ఆవిడముఖం చూడలేకపోయాను. ఎలా చూడను?

"మిమ్మల్ని అనవలసిందిలేదు. అనుమానపడడం మీపురుష జాతి స్వభావము" అంది. తరవాతనే నెప్పుడూ మా ఆవిడమీద అనుమానపడలేదు—ఇలా గేవుంటాయ్! అనుకుంటూ అనుమానాలంటే!

★




(30 వ పేజీ తరువాయి)

రచనలు మరచి పోవుడు. ఆ రచనలలో తెలుగుభాష సొగసు చూడుడు.

నాదనామక్రియ, చాపు, "పయ్యెదాపై చేరుకొని, పవ్వళించియుండే సామికి, అయ్యయ్యో! వెగటాయెనే", అని వ్రాసినారు. "పయ్యెదపై చేరుకొని" అను పదములు తగిన చోటులో ఎంత సొగసుగా చిత్రించినారో చూడుడు. వీరి పదములలో అనేకచోట్ల బహులలితమై మృదువైన భావను వాడియున్నారు. మంచి ముత్యాల దండ గూర్చినట్లు, ముద్దుల మూటగట్టు చక్కటిభాషలో వ్రాసినారు.

వారికవిత్వమునుగూర్చి, ఆ పదములయొక్క విశేషమునుగూర్చి తెలియపర్చుట నాబోటి వాండ్రకు సాధ్యపడునదికాదు. అదీగాక యింకొక విశేషము. వీరిన్ని జీవాత్మకు, పరమాత్మకు, నాయకా, నాయకీభావము కల్పించి చెప్పినారు. మరిన్ని వారిపదములు, ఘంటా, సావేరి, రేగుప్తి, ఆహిరి, గౌళిపంతు, ద్విజావంతి, నాదనామక్రియ, ఆనందభైరవి, ఫరజు, అసావేరి, బిలహరి, ముఖారి, శహాన, తోడి అనేకములైన రాగములలో వ్రాస్తూ ఎక్కువ పదములు మిశ్ర చాపు తాళములో వ్రాసినారు. "ఆర్యులారా, అమ్మలారా, గాయకులు ప్రతి పాటకచ్చేరీలయందు పాడవలెనని, విద్యార్థులు, విద్యార్థినులు ప్రతి పాఠశాలలో వారి పదములు నేర్చుకొని గానంచేసి శ్రీ రుక్మిణీసమేత రాధాకృష్ణ పరమాత్ముని అనుగ్రహ పాత్రులు కావలెనని భగవంతుని సర్వదా ప్రార్థించుచున్నాను".

★